బడిలో భాషల సంబరాల సందడి

- నేటితో ముగియనున్న భాషోత్సవాలు
- మాతృభాషా దినోత్సవానికి ఏర్పాట్లు

నిడమర్రు: ఇతర భాషలను ఎన్నో నేర్చినప్పటికీ తల్లి భాష లేనిదే ఏ వ్యక్తి గొప్పవాడు కాలేడు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ అంతర్జాతీయ భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 18వ తేదీ నుంచి భాషోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు శుక్రవారంతో ముగియనున్నాయి. దీనిలో భాగంగా ప్రతి పాఠశాలలో అంతర్జాతీయ భాషా దినోత్సవం నిర్వహించాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీని కోసం ప్రతి పాఠశాలకు రూ.500 నిధులు విడుదల చేసారు. ప్రతి మనిషి అమ్మను కాపాడుకున్నట్లే మాతృభాషనూ కాపాడుకోవాలి, జీవితంలో ఎదగాలంటే ఇతర భాషలను నేర్చుకోక తప్పదు. వాటి ప్రభావం అమ్మ భాషపై పడకుండా చూసుకోవాలంటూ ఈ నాలుగు రోజులు పాఠశాలల్లో నిర్వహిస్తున్న భాషోత్సవాల సారాంశంగా ఉపాధ్యాయులు చెప్తున్నారు.

నేడు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు

ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ భాషల సంబరాల్లో 19న ఆంగ్లం, 19న సంస్కృతం, హిందీ, ఉర్దూ, 20న గిరిజన భాషతోపాటు, మన రాష్ట్ర సరిహద్దు రాష్ట్రాలకు చెందిన మాతృ భాషలైన కన్నడం, తమిళం, ఒరియా భాషలపై విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషపై విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నారు.


వక్తృత్వం పోటీల్లో పాల్గొన్న కొమ్మర యూపీ స్కూల్ విద్యార్థులు


హిందీ భాషపై విద్యార్థులు తయారు చేసిన బోధనోపకరణాలు

భాషపై పట్టు సాధించే అంశాల్లో..

ఎంపిక చేసిన భాషకు సంబంధించి ఆయా తేదీల్లో రీడింగ్, షార్ట్ స్టోరీలు చెప్పడం, వ్యాసరచన, చర్చ, వక్తృత్వం, స్పెల్ చెక్, రోల్ ప్లే, బోధనోపకరణాల తయారీ వంటి అంశాలల్లో విద్యార్థులు పోటీలు జరుగుతున్నాయి. సంస్కృతంలో శ్లోకాలు, ఉర్దూ గజల్స్ చెప్పే అవకాశం కల్పించారు. ఈ అంశాలు ఆయా భాషలపై పట్టు సాధించేలా పోటీలు పొందించారు. గిరిజన భాషలు, సంస్కృతి ప్రతిబింబించేలా సంప్రదాయ నృత్యాలు, పాటలు, ఆటలులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థి ప్రతిభను వెలికి తీయడానికి దోహదపడతాయని ఉపాధ్యాయులు చెపుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన రూ.500 ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏమాత్రం సరిపోవని, ఉపాధ్యాయులు, దాతల సహకారంతో ఈ భాషోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు చెపుతున్నారు.

మండలాలకు అందిన నిధులు వివరాలు

మండలం	పాఠశాలలు	మంజూరు
నిడమర్రు	33	రూ.16,500
గణపవరం	48	రూ.24,000
భీమడోలు	37	రూ.18,500
ఉంగుటూరు	56	రూ.28,000
మొత్తం	174	రూ.87,000

ఇతర భాషలపై అవగాహన



తెలుగుతోపాటు సరిహద్దు రాష్ట్రాలైన ఒరిస్సా, కర్ణాటక, తమిళనాడు మాతృభాషలతోపాటు, గిరిజన భాషలు, వారి కట్టు బాట్లు, ప్రాస వంటి వాటిపై ఉపాధ్యాయులు వివరించారు. దీంతో తెలుగుతోపాటు ఇతర భాషలపై మా తరగతిలోని విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కలిగింది.

– కిక్కిశెట్టి పవిత్ర, 7వ తరగతి విద్యార్థిని

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ఏటా మా పాఠశాలలో మాతృభాష దినోత్సవం నిర్వహిస్తాం. తల్లి ఒడి నుంచి నేర్చుకునే మొట్ట మొదటి భాష మాతృభాష. ఈ సారి భాషోత్సవాల పేరుతో ఇతర భాషలపై కూడా పోటీలు నిర్వహించాం. పాఠశాల నిధులతో పాటు నేను కొంత సొమ్ము కేటాయించి బహుమతులు అందిస్తున్నాం.

– జి. పార్వతి, స్కూల్ అసిస్టెంట్, తెలుగు

క్లుప్తంగా

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీలు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్ర కేఆర్‌పీ కె.విజయలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ఈదర సుబ్బమ్మ దేవి మున్సిపల్ స్కూల్‌లో జ్ఞాన జ్యోతి మూడో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని సూచించారు. వారికి ఆటపాటల ద్వారా నేర్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు టి.జోషి, ఎం మీనాక్షి, కేఆర్‌పీలు, సూపర్ వైజర్లు బి.మంగ, కె.సత్యనారాయణమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఉద్యోగాలు కల్పించాలి


మాట్లాడుతున్న తొర్లపాటి రాజు

ఏలూరు (టూటౌన్) : అమరావతిని ఫ్రీ జోన్‌గా చేసి 26 జిల్లాల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక స్ఫూర్తి భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల తీర్మానాలను వివరించారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులతో పాటు, గ్రూప్ వన్, త్రీ ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతా క్రీడాకారులకు నైపుణ్య శిక్షణ ఇప్పించాలని కోరారు. ఏలూరు జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటు, చింతలపూడి ప్రాంతంలో బొగ్గు నిల్వల వెలికితీత ద్వారా ఉద్యోగాలు కల్పించవచ్చని వివరించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ కన్వీనింగ్ కమిటీ సభ్యులు కంభం ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

స్తంభాన్ని ఢీకొన్న ఆటో

ఏలూరు టౌన్: ఆటో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని ఏలూరు రూరల్ పోలీసులు తెలిపారు. ఏలూరు నుంచి కై కలూరు వైపు ఐదుగురు ప్రయాణికులతో వెళుతున్న ఆటో అతివేగం కారణంగా లింగరావుగూడెం మలుపులో అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో శ్రీపర్రు గ్రామానికి చెందిన జయమంగళ సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయని, మరో నలుగురికి గాయాలయ్యాయని తెలిపారు. వీరిని 108 అంబులెన్స్‌లో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారన్నారు. ప్రయాణికుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు దర్యాప్తు చేపట్టామని పోలీసులు వివరించారు.

22న ఆప్కాస్ ఉద్యోగుల ధర్నా


ఆందోళనల కరపత్రం విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆప్కాస్ ఉద్యోగుల పర్మినెంట్ కోరుతూ మున్సిపల్ ఆఫీసుల వద్ద ఈనెల 22న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య కోరారు. గురువారం పవరుపేట సీఐటీయూ కార్యాలయంలో దశల వారి ఆందోళన కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ నెల 6న మంత్రివర్గం రాష్ట్రంలో ఏపీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ (ఆప్కాస్)ను రద్దుచేసి, ఉద్యోగులను 2019కు ముందు పాత పద్ధతిలో ప్రైవేట్ ఏజెన్సీలు, కాంట్రాక్టర్లకు అప్పజెప్పాలని నిర్ణయించడాన్ని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) తీవ్రంగా నిరసించిందన్నారు. రాష్ట్రంలో ఆప్కాస్‌లో ఉన్న లక్ష మంది ఉద్యోగుల వల్ల గత ఐదేళ్లగా ప్రతినెలా 1నే జీతం వస్తుందని, పీఎఫ్, ఈఎస్‌ఐలు సకాలంలో జమ చేస్తున్నారని, కనీస వేతనాలు అమలవుతున్నాయని తెలిపారు. ఆప్కాస్‌ను కొనసాగించాలని లేదా ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లావేటి కృష్ణారావు, అంగులూరి జాన్ బాబు, బంగారు వెంకటేశ్వరరావు, బంగారు రమేష్, జయకుమార్, తానంకి జార్జి, పి.విష్ణు, పి.నాగరాజు, బండి రాజు, కాళిదాసు, గోపి, గంగాధర్, అల్లం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): దెందులూరు మండలం ముప్పవరం గ్రామంలో నాగ హనుమాన్ ఆయిల్ సాల్వెంట్‌లో సంభవించిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నలుగురు కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని సీఐటీయూ కమిటీ తరపున జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఇద్దరు కార్మికులను హైదరాబాదు చికిత్స నిమిత్తం తరలించడం ఆందోళనకరమని తెలిపారు. యాజమాన్యం ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతుండడంతో పదేపదే ఇలాంటి ఘటనలు సంభవిస్తున్నాయని ఆరోపించారు. గాయపడిన కార్మికులకు పూర్తిస్థాయి వైద్య చికిత్స యాజమాన్యం అందించాలని డిమాండ్ చేశారు.

వాల్ పోస్టర్ విడుదల

ఏలూరు (టూటౌన్): విజయవాడలో ఈనెల 23న నిర్వహించే రెండు న్యూ డెమోక్రసీ విప్లవ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని కోరుతూ ఏలూరు మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై వినతి


ఎమ్మెల్యే చంటికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏలూరు నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటికి గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఆప్కాస్ రద్దు చేస్తూ రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదించినట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను క్రమబద్ధీకరించి, ఉద్యోగ, వేతన భద్రత కల్పించాలని, మూడేళ్ల సరెండర్ లీవ్, ఎస్ కాష్మెంట్, మూడు డీఏలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కసంకోట నాగేంద్ర,పుచ్చ శంకర్, మీసాల చంద్రమౌళి, గోవాడ మల్లేశ్వరరావు, కసింకోట రమణ, అల్లం పెద్దిరాజు, ధనియాల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మూల విగ్రహాల ఊరేగింపు


మూల విగ్రహాల ఊరేగింపులో భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక తంగెళ్లమూడి బీడీ కాలనీ, చెరువుగట్టుపై నూతన ఆలయంలో ప్రతిష్ఠించనున్న మహాగణపతి, సీతా రామచంద్ర స్వామి, కనకదుర్గమ్మవార్ల మూల విగ్రహాలను గురువారం నగర వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవరకొండ శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో క్షీరాధివాస పూజలు, విఘ్నేశ్వర పూజ, గణపతి తర్పములు, మండప పూజ, పంచగవ్య ప్రాశన ఘనంగా నిర్వహించారు. అనంతరం వివిధ రంగుల పుష్పాలు, అరటి చెట్లతో ప్రత్యేక అలంకరించిన వాహనంపై మూల విగ్రహాలను ఉంచి జై శ్రీరామ్ నామ స్మరణతో మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు రేకుల చిన్నారావు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 8.30 నిమిషాలకు విఘ్నేశ్వర పూజ, గోపూజ పంచగవ్య ప్రాశన, మండప పూజలు, చండీ పారాయణ, సామూహిక కుంకుమ పూజలు, లలిత సహస్ర పారాయణ, సాయంత్రం చండీ హోమము, లలిత సహస్ర నామ పుష్పాధివాసం నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఏలూరు అసెంబ్లీ ఆర్‌టీఐ అధ్యక్షుడిగా రమేష్

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు నగరానికి చెందిన బళ్ల హేమకుమార్ (రమేష్)ను ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

విద్యార్థి వైద్యానికి చేయూత


విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల 9వ తరగతి బావిశెట్టి సోహిల్ రాజు చేతికి శస్త్ర చికిత్స నిమిత్తం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ రూ.10 వేలు ప్రధానోపాధ్యాయురాలు రోజిలిన్ ద్వారా గురువారం అందజేసింది. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ సభ్యులు జి.కృష్ణ, డీకేఎస్ఎస్ ప్రకాశరావు, గుంటూరు శ్రీనివాసరావు, బీఆర్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఆర్‌టీసీ, పత్తేబాద ఫీడర్లలో లైన్ల నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త బస్‌స్టాండ్ ఏరియా, ఎన్ఆర్ పేట, ఆర్‌వీ రామరావు వీధి, డాక్టర్ సత్యనారాయణ వీధి, జగన్ మోహన్ రావు వీధి, ఫైర్ స్టేషన్ సెంటర్, పత్తేబాద, రైతు బజార్, నాలుగు గుళ్ల సెంటర్, మంచినీటి తోట, మరకవారి వీధి, ఉండవల్లి అపార్ట్ మెంట్ రోడ్, గంగా చికెన్ సెంటర్, మోతేవారి తోట, భవిష్య క్లినిక్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

హామీలపై చేతులెత్తేసిన ప్రభుత్వం

ఏలూరు (టూటౌన్): ఎన్నికల హామీల అమలుపై కూటమి ప్రభుత్వం చేతులెత్తేయడం సిగ్గుచేటని ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా కట్టా వేణు గోపాల కృష్ణ ఆరోపించారు. గురువారం స్థానిక ఎన్ఆర్‌పేటలో వివిధ ప్రజా సంఘాలు, బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. తనను చట్ట సభకు పంపితే నిరుద్యోగులకు న్యాయం జరిగేంత వరకు పోరాడతానని వేణు గోపాల కృష్ణ తెలిపారు. సూర్యనారాయణ మాస్టారు, బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాసరావు, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌పీఆర్ విఠల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామకోటి మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో వార్షిక రామకోటి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత కల్యాం నిర్వహించారు. సాయంత్రం నగరంలోని హనుమాన్ నగర్ రాధాకృష్ణ పిరమిడ్ ధ్యాన మందిరం ప్రతినిధి రాధ జోస్యుల సీతమ్మ వారి దివ్య చరితామృతం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి తాడేపల్లిగూడెంకు చెందిన ముదపాక బాలసుందరం భాగవతార్ విరాట్ పర్వం అనే అశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు. అర్చకులు దివాకరుని వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ ప్రత్యేక పూజలు చేయగా, రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	36
వంకాయలు (కాంతులు)	24	బీన్స్ చిక్కుడు	50
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	72
కాకర కాయలు	36	బీట్‌రూట్	32
బీరకాయలు (పందిరి)	44	కీరా దోస	44
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	60-72
క్యాబేజీ	14	అల్లం	50
క్యారెట్	32	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	32	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్	22.30	13
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	12
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

పంటల పండుగలకు వేళాయెె


గోగుమిల్లిలో పండుగ కోసం ఇళ్ల వద్ద పెంచిన చిక్కుడు పాదులు


అంతర పంటగా ఉన్న కంది, జొన్న


ముంజులూరులో కొయ్యకుండా ఉంచిన చిక్కుళ్లు

- దేవతలకు నైవేద్యంగా సమర్పించాకే తినడం ఆనవాయితీ
- ఇంటికో కోడితో మొక్కు చెల్లింపు
- గిరిజన గ్రామాల్లో సందడి

బుట్టాయగూడెం: ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో పంటల పండుగల సందడి నెలకొననుంది. కొండలపై నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవించే కొండరెడ్డి తెగలకు చెందిన ఆదివాసీ గిరిజనులకు పోడు వ్యవసాయమే జీవనాధారం. సామలు, జొన్నలు, రాగులు, కొర్రలు, కందులు, వరి తదితర పంటలను పండిస్తారు. ఈ పంటలు చేతికొచ్చినా గిరిజనులు ముట్టుకోరు. కొత్త పప్పుల పండుగ, బాట పండుగలను ఎంతో వైభవంగా చేసి ఆ పండగల్లో ముందుగా వన దేవతలకు నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం ఆ పంటలను గిరిజనులు ఆహారంగా స్వీకరిస్తారు. ఈ విధానం తరతాలుగా గిరిజన గ్రామాల్లో వస్తున్న సంప్రదాయం. వేసవి కాలం వచ్చిందంటే చాలు గిరిజన గ్రామాల్లో కొత్త పంటల పండగల సందడి నెలకొంటుంది. ఫిబ్రవరి నెల నుంచి మే నెలాఖరు వరకు గిరి పల్లెల్లో పప్పుల పండుగలు నిర్వహిస్తారు. పంటలు సంవృద్ధిగా పండి దిగుబడులు బాగా వచ్చేలా దీవించాలని వన దేవతలను పూజిస్తారు.

చిక్కుడు, చింత పండుగ

కొండరెడ్డి గిరిజన గ్రామంలో ప్రతి ఇంటి వద్దా తప్పనిసరిగా చిక్కుడు పాదులు పెంచుతారు. చిక్కుడు కాయలు కాచినా పండుగ చేసే వరకు వాటిని ముట్టరు. బయట నుంచి వచ్చిన వారిని ముట్టుకోనివ్వరు. వన దేవతకు నైవేద్యం పెట్టిన తర్వాతే చిక్కుడు కాయలను తింటారు. అలాగే చింతచెట్లకు పండుగ చేసాకే చింత కాయలు కోస్తారు.

వనదేవతలకు పూజలు

ప్రతి ఉగాది పండుగకు గ్రామంలోని గంగానమ్మతో పాటు వనదేవతలను గిరిజనులు పూజిస్తుంటారు. మామిడికాయ పండుగను వైభవంగా చేస్తారు. ఈ పండుగను కోయ, కొండరెడ్డి గిరిజనులు రెండు తెగల వారు చేస్తారు. దేవతలకు దూప, దీప నైవేద్యాలతో ఘనంగా పూజలు చేసిన తర్వాతే చెట్ల నుంచి మామిడి కాయలను కోస్తారు. ఇంటికో కోడిని తీసుకొచ్చి గ్రామదేవతకు మొక్కుగా ఇస్తారు. అనంతరం ఆ కోళ్లను వండుకుని సహపంక్తి భోజనాలు చేస్తారు.

కిల నంజు, తాటి, జీలుగు కల్లు సేవిస్తారు

మామిడికాయ పండుగలో మరో ప్రాముఖ్యత ఉంది. దేవతలకు పూజల అనంతరం గ్రామంలోని చిన్నాపెద్దా అందరూ కలిసి ఒక గుజిడీ ఏర్పాటు చేసుకుంటారు. అక్కడ కిల నంజును తెచ్చుకుని లొట్లలో తాటి కల్లు ఏర్పాటు చేసుకుని జీడి, మామిడి ఆకులతో, దారకాయలతో ప్రతి ఒక్కరూ తాటికల్లు సేవిస్తారు. ఇది పూర్వం నుంచి వస్తున్న ఇక్కడి ఆచారం. మామిడికాయ పండుగలో తప్పనిసరిగా కల్లు సేవిస్తారు.

సంప్రదాయ నృత్యాలు

పంటల పండుగలను పురస్కరించుకుని గ్రామాల్లో చిన్నా, పెద్దా తేడా లేకుండా గిరిజన సంప్రదాయరేల నృత్యాలను, డోలు వాయిద్యాల దరువుల చేస్తారు. ఎంతో లయబద్ధంగా రేరేలయ్య రేరేలా అంటూ గ్రామ దేవత గుడి, చెట్టు చుట్టూ నృత్యం చేస్తూ తిరుగుతారు.

పండుగ చేశాకే తింటాం



మామిడికాయ, జొన్న, రాగులు, చిక్కుళ్లు, కందులు పంటలు చేతికి వచ్చిన తర్వాత వనదేవతలకు నైవేద్యంగా పెట్టిన తర్వాతే వీటిని తినడం మా సంప్రదాయం. ఈ ఏడాది కూడా పండుగలకు సిద్ధమవుతున్నాం. వేసవి కాలంలో చిన్నా, పెద్దా అందరం కూడా సంతోషంగా ఈ పండుగ చేసుకుంటాం.

– చంద్రు వెంకటరెడ్డి, చింతకొండ, పోలవరం మండలం

వనదేవతలను పూజిస్తాం



వన దేవతలను పూజించడం పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయం. మేము పండిచిన పంటలకు పండుగలు చేసి వన దేవతలకు నైవేద్యంగా సమర్పించిన తర్వాతే ఆ పంటలను తింటాం. నేటికీ ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం.

– కె.చిన్నారెడ్డి, ముంజులూరు, బుట్టాయగూడెం మండలం